

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY



ఆదివారం 24 నవంబరు 2024

కాల్వలోకి దూకి వృద్ధుడి ఆత్మహత్య

రేవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రేవల్లి మండల కేంద్రంలోని తల్పునూరు గ్రామ శివారులోని డి8 కాల్వలో దూకి బంగారయ్య (68) ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలం, గుడిపల్లికి చెందిన బంగారయ్య(68) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది శుక్రవారం కేఎల్ఐ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం శనివారం తల్పునూరు గ్రామ శివారులోని కాల్వలో లభించింది. అతని కుమారుడు కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.



అసమగ్ర సర్వే

- ఎన్యుమరేటర్ల అన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పని ప్రజలు
- ఆస్తులు, ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలు చెప్పేందుకు విముఖం
- ఆధార్ నెంబర్‌తో అన్నీ వస్తాయని సమాధానం చెబుతూ.. దాటవేత
- సమగ్ర కుటుంబ సర్వే భయంతో ఉచితాలు పోతాయనే భావన
- సమయపాలన సరిగా లేకపోవడంతో నెమ్మదిగా సాగుతున్న సర్వే


నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో సర్వే తీరును పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సురేష్

మహబూబ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు ప్రజల నుంచి సహకారం అంతంత మాత్రంగానే ఉంది. అనుకున్న విధంగా సర్వే చేపట్టినా.. సమయపాలన లేకపోవడం వల్ల మందకొడిగా సాగుతోంది. ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తి స్థాయిలో సమాధానాలు ఇవ్వడం లేదని స్పష్టమవుతోంది. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా అన్ని వివరాలు అందించడంతో పలు ప్రభుత్వ పథకాలకు కొందరు దూరమయ్యారు. మెజారిటీగా ఆస్తుల వివరాలు చెప్పడంతో కుటుంబంలో ఫోర్ వీలర్ ఉందనే కారణంతో చాలామందికి పింఛన్లు దూరమయ్యాయి. అన్నకు కారు ఉంటే చెల్లెలికి పింఛన్ తొలగించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో ప్రజలు పథకాలు పోతాయనే భావనతో సర్వేలో వివరాలు సరిగా చెప్పడం లేదు. అలాగే కుటుంబ ఆదాయం వివరాలు కూడా వెల్లడించడం లేదు. సర్వే జరుగుతున్న తీరు, ప్రజల సుముఖతపైన ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో నియోజకవర్గానికి 200 మంది చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 2,600 మందితో సర్వే చేసింది. వారికి నాలుగు ప్రశ్నలను సంధించగా.. సర్వే సరైనది అంటూనే పలు వివరాలు వెల్లడించడం లేదని స్పష్టమైంది.

ఆంధ్రజ్యోతి సర్వే

మందకొడిగా సర్వే..

ఈ నెలాఖరు వరకు సర్వేను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వివరాల సేకరణ జరగడం లేదని తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం ప్రజలు సర్వే చేస్తున్న అధికారులకు అందుబాటులోకి రాకపోవడమేనని స్పష్టమవుతోంది. గతంలో సమగ్ర కుటుంబ సర్వేను ఒకే రోజు చేపట్టారు. అప్పుడు అందరూ ఇంటివద్ద అందుబాటులో ఉండాలని ముందుగా సూచించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు

(మిగతా 6లో..)

సర్వే సరైనదే


రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సరైనదే. సర్వే వల్ల ఉన్న అసమానతను తెలుసుకోవడం సాధ్యమవుతుంది. సామాజిక వర్గాలు, వారి స్థితిగతులు, ఆర్థిక స్థితి తెలుసుకోవడం, దానికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలు సిద్ధం చేయడం వీలవుతుంది. చాలామంది అనర్హులు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారు. సర్వేను కచ్చితంగా అమలు చేసి నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

- రెహమాన్, నాగర్‌కర్నూల్

సర్వే ఎందుకో చెప్పడం లేదు


సమగ్ర సర్వే కోసం ఇంటికి వచ్చిన అధికారులకు పూర్తి సమాచారం ఇచ్చాను. వచ్చిన అధికారులు ఆధార్ కార్డు నెంబర్, రేషన్ కార్డు నెంబర్, భూమి పాస్‌బుక్ నెంబర్, ఆవులు, బర్రెలు, కార్లు ఉన్నాయా? అని అడిగి రాసుకున్నారు. ఎందుకు ఈ సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్నారని అధికారులను అడిగితే సరిగా సమాధానం చెప్పడం లేదు. ప్రజలకు సర్వే వల్ల ఉపయోగం ఏమిటో.. నష్టం ఏమైనా జరుగుతుందా? తెలియజెప్పాలి.

- మన్యం, మర్రికుంట, వనపర్తి

ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

- నెలరోజుల్లో మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తెస్తా : శాట్ చైర్మన్ శివసేనారెడ్డి


గద్వాల జిల్లా జట్టు సభ్యులతో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

ఎర్రవల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని హనుమాన్‌యూత్ అధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞా, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పది రోజుల నుంచి కొనసాగుతున్న ఈ పోటీలలో 50 జట్లకు పైగా పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో గద్వాల జిల్లాకు చెందిన శివపురం గ్రామ నక్షత్ర లెవెన్ వర్సెస్ కర్నూలు జిల్లాకు చెందిన గూడురు శివ లెవెన్ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలలో గద్వాల జిల్లాకు చెందిన నక్షత్ర లెవెన్ జట్టు విన్నర్‌గా నిలిచింది. రన్నర్‌గా కర్నూలు జిల్లాకు చెందిన గూడురు శివ లెవెన్ జట్టు నిలిచింది. విన్నర్ జట్టుకు దాత ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి రూ. 80వేలు, రన్నర్ జట్టుకు అందించే రూ. 40 వేలను జోగుళాంబ ఆలయ ధర్మకర్త సరస్వతి విరాళం అందించారు. ఈ నగదును విన్నర్, రన్నర్ జట్లకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అందించారు. బెస్ట్ బ్యాట్స్ మ్యాన్‌గా రాజోళికి చెందిన హనుమంతురెడ్డి, బెస్ట్ బౌలర్‌గా ఎర్రవల్లికి చెందిన శివకుమార్‌లు నిలిచారు. అంతకు ముందు శాట్ చైర్మన్ మినీ స్టేడియాన్ని డీవైఎస్‌వో ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ స్టేడియాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లడి నెల రోజుల్లో వినియోగంలోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞా, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు రవి, మార్కెట్ చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్, అలంపూర్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్, అడ్డాకుల రాము, డీసీసీ కార్యదర్శులు సిరాజ్, శ్యామ్ సుందర్, సంధ్యబాబు ఉన్నారు.

మెట్రుగుంట గ్యాంగ్ దొంగ అరెస్ట్

- రూ. 3.10 లక్షలు రికవరీ
- ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులో ఇద్దరికి రిమాండ్
- విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మాటు వేసి నగదు డ్రా చేసుకునే వారిని అనుసరించి డబ్బులు ఎత్తికెళ్లిన మెట్రుగుంట ముఠా సభ్యుడిని గద్వాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 7న అలంపూర్ మండలం ఇమామ్‌పురం గ్రామానికి చెందిన కుర్వ సిద్దన్న, ఆయన కుమారుడు జితేందర్ ప్లాట్ అమ్మగా వచ్చిన డబ్బులు రూ. 3.60 లక్షలను కారులో ఉంచి కలెక్టరేట్ ఎదురుగా హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లారు. గుర్తుతెలియని దొంగలు కారు అద్దాన్ని పగులకొట్టి అందులో ఉన్న రూ. 3.60 లక్షలను ఎత్తికెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాము. శనివారం ఉదయం ఎర్ర వల్లి చౌరస్తాలో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గద్వాల పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి రూ. 3.10లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టిశ్రీరాములు జిల్లా, బోగోలు మండలం, కప్పరాల తిప్ప బిట్రగుంటా గ్రామానికి చెందిన ప్రసంగిగా గుర్తించాము. గతంలో ఇలాంటి దొంగతనం కేసులో తిరుపతిలో ఆయనపై కేసు నమోదు చేశారని, ఈ కేసులో జైలుకు కూడా వెళ్లాడని తెలిపారు. ఇతడు మెట్రుగుంట గ్యాంగ్‌లో ఓ సభ్యుడిగా ఉన్నాడని తెలిపారు. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇస్తానని డబ్బులు వసూలు చేసిన అంకితను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అదే విధంగా గద్వాల హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇస్తానని డబ్బులు వసూలు చేసిన గుర్రం యువరాజును అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ నెల 16న విశ్వసనీయ సమాచారం మేరకు గద్వాల మండలంలోని వెంకంపేట సమీపంలో యువరాజును పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసులు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్, సిబ్బందికి ఎస్పీ రివార్డు అందించి సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ, రూరల్ ఎస్ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.


నెట్‌లో ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

అన్ని హంగులతో..

- పట్టణాల్లో విస్తరిస్తున్న ప్రైవేటు ఆట స్థలాలు
- రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం
- వినూత్న ఆలోచనతో ఉపాధి పొందుతున్న పలువురు

7

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 2,950 మంది విద్యార్థులు

7


గద్వాల పట్టణంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

గోవిందా.. గోవింద

కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు


7

బతకాలా.. చావాలా?

- కన్నీటి సంద్రంలో అడవిబిడ్డలు
- భర్త కోసం పుస్తెను అమ్ముకున్న అంటున్న చెంచు మహిళ

6

బియ్యం నాణ్యత లేకుంటే వాపస్

- కలెక్టర్ ఆదర్శ్ సురభి


గిరిజన సంక్షేమ హాస్టల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాలకు సరఫరా చేసే బియ్యం, కూరగాయలు, ఇతర సరకులు నాణ్యత లేకుంటే తీసుకోవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహం, ఐజయ్య కాలనీలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం, కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఫుడ్ సూపర్‌వైజర్, విద్యార్థుల మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు వండే బియ్యం, కూరగాయలు, ఇతర సరకులను కలెక్టర్ పరిశీలించారు. సరకులు వచ్చినప్పుడు మెస్ కమిటీ సభ్యుల సంతకాలు రిజిస్టర్‌లో తీసుకోవాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. బియ్యం కానీ కూరగాయలు బాగలేకుంటే తిరిగి పంపించాలని సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, ప్లేట్లు, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కునే విధంగా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, వాటిలో ఫుడ్ సూపర్‌వైజర్‌తో పాటు మెస్ కమిటీ సభ్యుల సంతకాలు ఉండాలని ఆదేశించారు. రిజిస్టర్‌ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార నాణ్యత బాధ్యతలను ఫుడ్ సూపర్‌వైజర్ చూసుకోవాలని, తేడా వస్తే బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం బాగుందని, భోజనశాల లేక ఆరుబయట భోజనం చేస్తున్నామని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ రెడ్డి, డీసీవో తిరుపతయ్య, మన్నాన్, ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ రాజు ఉన్నారు.

హోంగార్డ్‌ల బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో దాదాపు 150 మందికి స్థానభ్రంశం

మహబూబ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హోంగార్డుల బదిలీలు జరగనున్నాయి. అందుకు కసరత్తు పూర్తి చేసిన అధికారులు శనివారం రాత్రి పొద్దుపోయాక ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతీ రెండేళ్లకోసారి బదిలీలు చేయాల్సి ఉండగా, జిల్లాల విభజన తరువాత ఐదేళ్ల క్రితం బదిలీలు జరిగాయి. ఆ తర్వాత బదిలీలు చేపట్టకపోవడంతో ఎక్కడి వాళ్లు అక్కడే ఉండిపోయారు. తాజాగా చేపట్టనున్న బదిలీల్లో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వంద మంది హోంగార్డ్‌లను ఇతర జిల్లాలకు బదిలీ చేయనున్నారు. వారిలో కొందరిని నారాయణపేట, మరికొందరిని గద్వాలకు బదిలీ చేస్తున్నారు. ఆయా జిల్లాల నుంచి వంద మంది హోంగార్డ్‌లు మహబూబ్‌నగర్‌కు రానున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లాకు చెందిన ఉద్యోగులు ఉండాల్సిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాల్సి వస్తోంది. నారాయణపేట, గద్వాల జిల్లాలలో సొంత జిల్లాకు చెందిన వాళ్లు తక్కువగా ఉన్నారు. దాంతో ఆయా జిల్లాలకు మహబూబ్‌నగర్ నుంచి ఎక్కువ మందిని పంపించాల్సి వస్తోంది. వనపర్తిలోనూ తక్కువగా ఉండగా, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆ జిల్లాకు చెందిన హోంగార్డ్‌లు దాదాపుగా సరిపడ ఉన్నారు. సొంత జిల్లాకు చెందిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తుండటంతో పలువురు నాయకులతో పైరవీలు సాగిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. పోలీస్‌శాఖలో ఓ ఉన్నతాధికారి కనుసన్నలలో బదిలీల ప్రక్రియ సాగుతుండటంతో ఆ అధికారిని ప్రసన్నం చేసుకునేందుకు హోంగార్డులు ప్రయత్నిస్తున్నారన్న వదంతులు వినిపిస్తున్నాయి.

బదిలీలలో అత్యంత గోప్యత

హోంగార్డుల బదిలీలలో ఉన్నతాధికారులు గోప్యతను ప్రదర్శిస్తున్నారు. ఓ జిల్లాకు సంబంధించిన అధికారి వద్దకు రెండు మూడ్రోజులుగా బదిలీల విషయంలో హోంగార్డులు క్యూ కడుతుండటంతో వారి తాకిడి తట్టుకోలేక ఆ అధికారి సెలవుపెట్టి వెళ్లినట్లు సమాచారం. సోమవారం నాటికి బదిలీలు, రిపోర్ట్ చేసే కార్యక్రమాలను ముగించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

జోరుగా వేరుశనగ సాగు

- పుష్కలంగా నీటి వనరులు
- గతేడాది కంటే పెరిగిన విస్తీర్ణం
- జిల్లాలో 1,24,555 ఎకరాలలో సాగు అంచనా

అచ్చంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేరుశనగ సాగు జోరందుకున్నది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది యాసంగిలో 1,03,139 ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది జిల్లాలో 1,24,555 ఎకరాల్లో సాగుచేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 1,01,873 ఎకరాలలో వేరుశనగ సాగుచేశారు. వానాకాలంలో సాగు చేసిన పత్తి పంటను తొలగించి వేరుశనగ సాగు చేస్తున్నారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో వేరుశనగతో పాటు వరి, మొక్కజొన్న, జొన్న, మినుము పంట సాగుచేస్తున్నారు. గడచిన ఐదారేళ్లుగా సాగుకు భిన్నంగా ఈ ఏడాది రైతులు వేరుశనగ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.


నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామంలో సాగుచేసిన వేరుశనగ పంట

సాగునీరు పుష్కలంగా ఉంది


యాసంగి సాగుకు నీరు పుష్కలంగా అందుతుందనే నమ్మకం వచ్చింది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో వానాకాలం పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పెట్టుబడి కూడా రాలేదు. చివరి దశలో ఉన్న పత్తి పంటను తీసి వేరుశనగ వేస్తున్నాం. అప్పుల నుంచి బయటపడతామని ఆశతో వేరుశనగ సాగు చేస్తున్నాం.

- మహేష్, రైతు గట్టుతుమ్మన్

ఈ ఏడాది సాగు పెరిగే అవకాశం


గతేడాది కంటే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో యాసంగిలో గతేడాదికంటే వేరుశనగ సాగు చేసే అవకాశముంది. గతేడాది మండలంలో 17వేల ఎకరాలలో వేరుశనగ సాగు చేశారు. ఈ ఏడాది నవంబరు మాసం నాటికి 13 వేల ఎకరాలలో సాగు చేశారు. ఇంకా 7వేల నుంచి 8వేల ఎకరాలలో సాగుచేసే అవకాశముంది.

- కృష్ణయ్య, వ్యవసాయ అధికారి

హడలెత్తిస్తున్న చిరుతలు

- అటవీ ప్రాంతం కాకపోయినా చిరుతల సంచారం
- గతంలో రెండు చిరుతల మృతి
- అటవీ అధికారుల బోనుకు చిక్కిన చిరుత...
- పరిసర ప్రాంతంలో మరో రెండు చిరుతలు ఉండొచ్చంటున్న అధికారులు


అటవీ శాఖ అధికారుల బోనుకు చిక్కిన చిరుత (ఫైల్)

మద్దూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో చిరుతలు హడలెత్తిస్తున్నాయి. అటవీ ప్రాంతం కాకపోయినా మండల పరిసర ప్రాంతాల్లో చిరుతల సంచారం చర్చనీయాంశంగా మారింది. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కాని ఇటీవల కాలంలో మద్దూర్ ఉమ్మడి మండలంలో మల్కి. జాదరావుపల్లి, దుప్పడ్‌గట్టు, చెన్నరెడ్డిపల్లి, మోమినపూర్ తదితర ప్రాంతాల్లో చిరుతల సంచారం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వీటి దాడి ఘటనలో పలువురు రైతులు మేకుల, లేగదూడలు కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. చిరుతలకు అనువైన ప్రాంతం కాకపోవడంతో రెండు చిరుతలు మృతి చెందిన సంఘటన కూడా చోటుచేసుకున్నాయి. నందిపాడ్ శివారులోని మల్కిజాదరావుపల్లి దుబ్బడి గుట్ట సమీపంలో, అదేవిధంగా కొత్తపల్లి మండల పరిధిలో నందిగామ సరిసర ప్రాంతంలో మరొకటి మృతి చెందింది. ఇదిలా ఉండగా, కొత్తపల్లి మండల శివారులో మరో చిరుత లేగదూడను దాడి చేసిన సంఘటనను రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వగా, బోను ఏర్పాటు చేసి చినేతను పట్టుకున్నారు. ఇలా గత నాలుగైదు నెలల వ్యవధిలో మండలంలో రెండు చిరుతలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, మరో చిరుత అధికారుల బోనుకు చిక్కింది. ఇవే కాకుండా మరో రెండు చిరుతలు పరిసర ప్రాంతాల్లో ఉండవచ్చునని అటవీశాఖ అధికారులు వెల్లడించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు కోత దశకు వచ్చిన తరుణంలో వ్యవసాయ పొలాల దగ్గర రాత్రి వేళల్లో ఉండాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ పొలాల దగ్గర కొట్టాల్లో పశువులు కట్టివేయాలన్నా భయపడుతున్నారు. అయితే చిరుతలు ఉన్నాయన్న భయం రైతుల్లో నెలకొన్నా గత కొంతకాలం నుంచి ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో రైతులకు ఉపశమనం కల్గిస్తున్నది.

చిరుతల నుంచి రక్షణ కల్పించాలి

- అంజిలయ్యగౌడ్, రైతు సంఘం నాయకుడు



మద్దూర్, కొత్తపల్లి, దామరగిద్ద మండలాల సరిహద్దులో చిరుతల సంచారంతో గతంలో పలువురు రైతుల పశుసంపదకు నష్టం వాటిల్లింది. చిరుతల బారిన పడి పశువులను కోల్పోయిన రైతులకు అటవీశాఖ నుంచి నష్టపరిహారం అందించాలి. అలాగే మరో రెండు చిరుతలు ఉండి ఉండవచ్చునని సంబంధిత అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్న క్రమంలో వీటి నుంచి రక్షణ కల్పించేవిధంగా గుట్టపు ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో బోనులు ఏర్పాటు చేసి రైతులు పశుసంపదను కాపాడటమే కాకుండా ప్రజలకు వాటి నుంచి పొంచి ఉన్న ప్రాణభయాన్ని దూరం చేయాల్సిన అవసరం ఉంది.

అసమగ్ర సర్వే

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఆ రోజు సొంత ప్రాంతానికి వచ్చి సర్వేలో పాల్గొనాలని కోరారు. కానీ ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే మాత్రం భిన్నంగా నడుస్తోంది. ప్రజలకు వీలున్న సమయాల్లో ఎన్యూమరేటర్లకు వివరాలు చెబుతున్నారు. ఎక్కువగా సాయంత్రం సమయాల్లో సర్వే జరుగుతుండగా.. మధ్యాహ్నం, ఉదయం సమయాల్లో మాత్రం ప్రజలు అందుబాటులో ఉండటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పొలం పనులకు వెళ్తుండటం, పట్టణాల్లో ఉద్యోగులు, వివిధ వృత్తి పనుల వారు వారి విధులకు వెళ్తుండటం ఎన్యూమరేటర్లకు అడ్డంకిగా మారిందని చెప్పొచ్చు. కొన్ని నియోజకవర్గాల్లో స్పీడ్‌గా సర్వే నడుస్తుండగా.. మరికొన్ని నియోజకవర్గాల్లో మాత్రం చాలా నెమ్మదిగా నడుస్తోంది. ఇప్పటివరకు సర్వే ఫారాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఎన్యూమరేటర్లు వారి వద్ద లేదా పంచాయతీ అధికారుల వద్ద ఫారాలను నిల్వ చేస్తున్నారు.

ఒక్కో నియోజకవర్గంలో ఒకలా..

ఆంధ్రజ్యోతి సర్వేలో అడిగిన ప్రశ్నలకు ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోలా ప్రజల నుంచి సమాధానాలు వచ్చాయి. సర్వే సరైనదేనా అనే ప్రశ్నకు అన్ని నియోజకవర్గాల్లో మెజారిటీ ప్రజలు సరైనదేనని సమాధానం ఇచ్చారు. కానీ.. ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నారా? అనే ప్రశ్నకు ఏడు నియోజకవర్గాల్లో సరిగా వెల్లడించడం లేదని మెజారిటీ ప్రజలు తెలుపగా.. ఆరు నియోజకవర్గాల్లో మాత్రం వెల్లడిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పథకాలు కోల్పోతామని భయపడుతున్నారా? అనే ప్రశ్నకు కొడంగల్ నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు ఆ భయం ఉందని సమాధానం ఇచ్చారు. సర్వే అనుకున్నట్లు జరుగుతుందా? అనే ప్రశ్నకు ఆరు నియోజకవర్గాల్లో ప్రజలు సరిగా జరగడం లేదని సమాధానం ఇవ్వగా.. ఏడు నియోజకవర్గాల్లోని ప్రజలు మాత్రం సరిగానే జరుగుతుందని చెప్పారు. అలాగే మెజారిటీ ప్రజలు ప్రతీదానికి ఆధార్ నంబర్ తీసుకుంటున్నప్పుడు.. ఆ నెంబర్ కొడితే ఎవరికి ఏం ఆస్తులు ఉన్నాయో తెలుస్తాయి కదా? అడిగితే చాలామంది తప్పుగా చెప్పే అవకాశం ఉంది కదా అని సర్వేలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులను అడిగారు.

కుటుంబ సర్వే చేయడం మంచిదే..



కుటుంబ సర్వే చేయడం మంచిదే కానీ అందులో ఆస్తి వివరాలు అడగడంతో చాలా కష్టంగా ఉంది. మళ్లీ ఆస్తి వివరాలు చెబితే ప్రభుత్వం నుంచి వచ్చే ఆసరా పింఛన్లు, రైతుబంధు, పంట నష్ట పరిహారం, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలు రావనే భయం ఉంది. కులగణన వల్ల స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆలోచించడం సరైన మంచి పద్ధతి.

- పెంటమీది నారాయణ, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా

ఈ సర్వేతో పనిలేదు



గతంలోనే ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. మళ్లీ ఈ సర్వేతో పని లేదు. ప్రభుత్వం ఇచ్చిన పథకాలను అమలు చేయాలి. పెంచిన పింఛన్ డబ్బులు ఇవ్వాలి.

- నాగమ్మ, హన్వాడ

ఇన్‌చార్జి బాధ్యత వద్దు

- ఏడీలుగా ఉండేందుకే ఇన్‌చార్జి డీఈవోల మొగ్గు
- ఇన్‌చార్జి వద్దంటూ కమిషనర్‌కు నాగర్‌కర్నూల్ డీఈవో లేఖ
- ఐదు జిల్లాలకూ రెగ్యులర్ విద్యాధికారులు కరువు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదు జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు లేరు. ఐదు జిల్లాలకు బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్, డీఈవో కార్యాలయంలో ఏడీగా పనిచేసే వారికి పాఠశాల విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాకు ఇన్‌చార్జి డీఈవోగా డైట్ కళాశాల అధ్యాపకుడు రవీందర్ బాధ్యత వహిస్తుండగా, ఈ నెల 7న ఓ ఉపాధ్యాయురాలి నుంచి రూ.50వేలు లంచం తీసుకుని ఏసీబీకి చిక్కారు. దీంతో మహబూబ్‌నగర్ డీఈవోగా చేరేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వికారాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పని చేస్తున్న ప్రవీన్‌కుమార్‌కు ఈ నెల 12న మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాకు ఇన్‌చార్జి డీఈవోగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన రెండు జిల్లాల బాధ్యతలు తీసకునేందుకు వెనుకడుగువేశారు. అతను రెండు జిల్లాలకు పని చేయలేనని పాఠశాల విద్యాశాఖ అధికారులకు విన్నవించుకున్నారు. వారి హామీతో ఎనిమిది రోజుల తర్వాత బాధ్యతలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే నాలుగు రోజుల క్రితం నారాయణపేట జిల్లా మడనూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని సుమారు వంద మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఎంఈవో, హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు. మరుసటి రోజు కూడా అదే పాఠశాలలో భోజనంలో పురుగులు రావడంతో నారాయణపేట డీఈవో అబ్దుల్‌ఘనిని సస్పెండ్ చేశారు. అబ్దుల్ ఘని కూడా వికారాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తూ నారాయణపేట ఇన్‌చార్జి డీఈవోగా గత ఉపాధ్యాయుల బదిలీల సమయంలో నియమించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్ , వనపర్తి ఇన్‌చార్జి డీఈవోగా పని చేస్తున్న గోవిందరాజులును ఆ జిల్లా నుంచి తప్పించి జోగుళాంబ గద్వాల జిల్లా, నారాయణపేట జిల్లాకు నియమిస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ఉత్తర్యులు వచ్చిన వెంటనే తను ఏ జిల్లాకు కూడా ఇన్‌చార్జి డీఈవోగా పనిచేయలేనని తనను సంప్రదించకుండా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని పాఠశా విద్యాశాఖ డైరక్టర్‌కు లేఖ రాశారు. తనకు మరో రెండేళ్ల సర్వీస్ మాత్రమే ఉందని, తాను మహబూబ్‌నగర్ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నా.. కానీ ఏ జిల్లాలో ఇన్‌చార్జి డీఈవోగా పని చేయలేనని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తనకు మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు రావాల్సి ఉండగా, మారుమూల ప్రాంత జిల్లాకు బదిలీ చేయడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల మీద అలక వహించినట్లు విశ్వసనీయ సమాచారం. వనపర్తి జిల్లాకు బదిలీ అయినా అబ్దుల్ ఘని కూడా ఇన్‌చార్జి డీఈవోగా చేరేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వచ్చిన ఇన్‌చార్జి డీఈవో రమేష్ కుమర్ కూడా ఆసక్తి చూపడం లేదు. మొత్తంగా ఇన్‌చార్జి డీఈవోలుగా చేరేందుకు ఇష్టపడటం లేదని స్పష్టమవుతుంది.

నాణ్యమైన భోజనం అందించాలి

- మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్


తాటిపర్తిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

భూత్పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచికరమైన, నాణ్యమైన విధంగా ఉండేలా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని తాటిపర్తిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న అక్షయ పాత్ర భోజనాన్ని రుచి చూశారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలను, వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు వండించేటప్పుడు ఆహారం వేడిగా ఉండేలా చూడాలన్నారు. బియ్యంలో పురుగులు పట్టకుండా చూడాలని, అదేవిధంగా కూరగాయలు శుభ్రంగా ఉండాలని వంట ఏజెన్సీలు చూడాలని డీఈవో సూచించారు. ఈయన వెంట సీఎంవో బైకని బాలుయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేట నర్సింగ్ కళాశాలకు రూ.26 కోట్లు



నారాయణపేట మెడికల్ కళాశాల

నారాయణపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్సింగ్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర 2024-25 సంవత్సరానికి 50 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 183ను ఈ నెల 21న విడుదల చేసింది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కృషితో నర్సింగ్ కళాశాల మంజూరుతో పాటు రూ.26 కోట్లు కేటాయించడం పట్ల జిల్లా ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. కౌన్సెలింగ్ ద్వారా నర్సింగ్ కళాశాలలో 60 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. తరగతులు డిసెంబరులో మొదలు కానున్నాయి.

కూతురు, అల్లుడితో కలిసి భర్తను చంపిన భార్య

తెలకపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమ మాట వినలేదని కట్టుకున్న భర్తను భార్య అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండలంలో చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిపల్లి గ్రామానికి చెందిన మూడింట్ల ఈశ్వరయ్య(56)ను భార్య ఎల్లమ్మ, ఆయన బావమరిది బాలస్వామి, పెద్ద కూతురు స్వాతి, అల్లుడు మల్లేష్, మరదలు ఆశమ్మలు కలిసి శుక్రవారం అర్ధరాత్రి విచక్షణా రహితంగా గొడ్డళ్లతో నరికి హత్యచేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 300లో ఈశ్వరయ్యకు 2ఎకరాల 14 గుంటల వ్యవసాయ పొలం ఉన్నది. ఆ భూమిని అమ్మి ఇల్లు కట్టుకోవాలని, తన ముగ్గురు కూతుళ్లకు వివాహాలు చేయాలని అయన ప్రయత్నించాడు. ఈశ్వరయ్య భార్య, బావమరిది, పెద్ద కూతురు, అల్లుడు ఇందుకు ఒప్పుకోలేదు. ఆయనపై కోపం పెంచుకొని హత్యకు పాల్పడ్డారు. మృతుని చెల్లెలు నిర్మల ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వ్యక్తి దారుణ హత్యతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాలమూరు జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చలి తీవ్రతతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. శనివారం వనపర్తి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వనపర్తిలో గరిష్ఠం 29.1, కనిష్ఠం 14.3, జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 32, కనిష్ఠం 15, నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠం 30, కనిష్ఠం 17, మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 28.9, కనిష్ఠం 17.5, నారాయణపేట జిల్లాలో గరిష్ఠం 29, కనిష్ఠం 18 డిగ్రీలు నమోదైంది.

ఓటరు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

-రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ డిప్యూటీ సీఈవో హరిసింగ్


కల్వకుర్తిలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న హరిసింగ్

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ డిప్యూటీ సీఈవో హరిసింగ్ సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్లతో క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్, ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ ఓటరు జాబితా నుంచి చనిపోయిన వారి పేర్లు తొలగించాలంటే వారి డెత్ సర్టిఫికెట్ ఉండాలని, లేనిపక్షంలో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం క్యాంపెయినింగ్ డే సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలకు పలు రకాల సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్‌ఎస్ శ్రీను, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అనిత ఉన్నారు.

బతకాలా.. చావాలా?


చిట్లంకుంట చెంచులు, ఇన్‌సెట్‌లో బాధితుడు మండ్లీ వీరయ్య

పదర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మేము బతకాల... చావాలా..? అంటూ మండలంలోని చిట్లంకుంట గ్రామానికి చెందిన చెంచులు శనివారం 'ఆంధ్రజ్యోతి'తో కన్నీరు పెట్టుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 11న 'అలుగు' అను వన్యప్రాణిని అక్రమంగా తరలిస్తున్న కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అనంతరం వారు కండీషన్ బెయిల్ మీద బయటకు వచ్చారు. అందులో భాగంగానే చిట్లంకుంట గ్రామానికి చెందిన మండ్లి వీరయ్య ఉన్నారు. కండీషన్ బెయిల్ మీద వచ్చిన వారు వారానికి ఒక సారి మద్దిమడుగు ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో హాజరై సంతకం పెట్టాలని బాధితుల తరపు లాయర్ తెలిపినట్లు వివరించారు. గురువారం ఫారెస్టు అధికారుల పిలుపు మేరకు అందరు అమ్రాబాద్‌కు ఫారెస్టు కార్యాలయానికి రాగా అక్కడి నుంచి మన్ననూర్‌కు పిలిపించినట్లు తెలిపారు. అక్కడికి వచ్చిన వారందర్ని సంతకం తీసుకొని పంపించి, కేవలం వీరయ్యతో పాటు మరొకరిని ఉంచుకున్నారు. ఓ గదిలోకి తీసుకెళ్లి బట్టలిప్పి, కింద పడేసి బూటు కాళ్లతో తొక్కారని వీరయ్య కన్నీరు పెట్టుకున్నాడు. రాత్రి సమయంలో బయటికి పంపించారన్నారు. ఉదయం పోయినవారందరు ఇంటికి చేరుకోగా వీరయ్య రాత్రి వరకు రాకపో వడంతో అతని భార్య గూడెంలో పిల్లల్ని పెట్టుకొని ఎదురుచూసింది. భర్తను విడిపించేందుకు తన పుస్తేతాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని చెంచు పెంట పెద్దలతో కలిసి వెల్లడానికి సిద్ధమైందని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన ఓ పెద్దమనిషి చొరవతో బైకు పంపి వీరయ్యను ఇంటికి తీసుకువచ్చారని వివరించారు. అప్పటికే బూటు దెబ్బలతో గాయాలైన వీరయ్య ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో గ్రామంలో ఓ ఫర్టిలైజర్ దుకాణదారుడి దగ్గరి వెళ్లి చేనులో వాడే పురుగుల మందు అడిగారని, కానీ ఆ దుకాణదారుడు ముందు ఇప్పుడెందుకంటూ ప్రశ్నించగా మౌనంగా ఉండటంతో గమనించిన దుకాణదారుడు చేరదీసుకొని చెంచు పెంటకు తరలించినట్లు తెలిపారు. మరుసటి రోజు ఉదయం కొంత మంది గ్రామ పెద్దలతో కలిసి కొట్టిన అటవీశాఖ అధికారులపై అమ్రాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. శనివారం సీఐ శంకర్ నాయక్ పిలి పించడంతో మళ్లీ అమ్రాబాద్ వెళ్లగా అక్కడ సీఐ, ఎస్ఐ లేకపోవడంతో సాయంత్రం వరకు ఉన్నామన్నారు. చివరికి ఎస్ఐ సాయంత్రం రాగా రిసీవ్డ్ కాపీ అడగగా సోమ వారం రమ్మని చెప్పినట్లు తెలిపారు. కొట్టిన అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే మానవ హక్కుల కమిషన్ కలుస్తామని గ్రామ పెద్దలు అంటున్నారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' మద్దిమడుగు రేంజ్ కార్యాలయానికి వెళ్లగా రేంజర్ మహేందర్ సెలవులో ఉన్నట్లు తెలిపారు. అమ్రాబాద్ ఎస్ఐ రజితను వివరణ కోరగా విచారించామని అన్నారు.


కోడేరులో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


ఉప్పునుంతల : తిప్పాపూర్‌లో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

అచ్చంపేటటౌన్/ఉప్పునుంతల/ఊర్కొండ/మన్ననూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు నిర్వహించారు. శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం భక్తులు కార్తీక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ముందుగ పాపనాశిని గుండంలొ పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఉప్పునుంతల మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో సత్యసాయిబాబ మందిరంలో సాయి భక్తులు సామూహిక వ్రతాలు చేశారు. ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయానికి కార్తీక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించి అన్నదానం చేశారు. అంతకుముందు స్వామి వారికి తెల్లవారుజామున అర్చకులు తైలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం తమ మొక్కులను చెల్లించుకొని కార్తీక దీపాలు వెలిగించారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద కార్తీకమాస ఆకు పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీక శనివారం పురస్కరించుకొని హనుమాన్ స్వాములు కార్తీక ఆకుపూజ చేశారు.


ఊర్కొండ పేటలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పల్లవిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య

వనపర్తి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న పల్లవి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. డిసెంబరు మాసంలో కేరళ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆమె పాల్గొననున్నది. ఈ నెల 22న పాలమూరు యూనివర్సిటీలో జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో పల్లవి తన ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్, అకాడమిక్ కోఆర్డినేటర్ దామోదర్ రెడ్డి, స్రవంతి, పరశురాముడు తదితరులు ఆమెను అభినందించారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు విద్యార్థి ఎంపిక

ఖిల్లాఘణపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన అండర్-8 జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో ఖిల్లాఘణపురానికి చెందిన విద్యార్థి ఎరుకలి మహేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కోచ్ దేవేందర్ తెలిపారు. క్రీడాకారుడు మహేష్ 300 మీటర్లు, 50 మీటర్లు స్టాండింగ్ బ్రాండ్ జంప్‌లో ప్రతిభ కనబరిచ డంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. డిసెంబరు 1న మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి 10వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న ట్లు కోచ్ దేవేందర్ వివరించారు.


మహేష్

మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మాక్ టెస్ట్‌లు

గద్వాల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ స్టడీ సర్కిల్ కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-2 కోసం ఫుల్‌లెంత్ మాక్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంపీ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, పార్సీ) అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోగా ఐడీవో సీలోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసు కోవాలన్నారు. డిసెంబరు రెండు నుంచి 9వరకు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్‌పై మాక్ టెస్ట్-1 నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి 4:30 గంటల వరకు హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సొసైటీపై పేపర్-2 నిర్వహిస్తారాన్నరు. అదేవిధంగా డిసెంబరు 3 నుంచి 10 వరకు పేపర్-3 (ఎకనామిక్స్, డెవలప్‌మెంట్) ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి పేపర్-4 (తెలంగాణ మూమెంట్, స్టేట్ ఫార్మేషన్)పై మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటలకు వదకు మాక్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్


బీటీరోడ్డు పక్కన మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిన్నంబావి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామ శివారులో బీటీ రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని వ్యవసాయ పొలం పనులకు వెళ్లే స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వయస్సు (30) ఉంటుందని, మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే చిన్నంబావి పోలీస్‌స్టేషన్ గాని వనపర్తి సీఐకి సంప్రదించాలని తెలిపారు.

ఆలయంలో వరుస చోరీలు

వడ్డేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ మారుతినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్ర, శనివారాల్లో గుర్తుతెలియని దుండగులు హుండీని పగులగొట్టి నగదును అపహరించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం మొదటి రోజు ఆయలంలో గంటలు, హారతులు ఇచ్చే కంచార్తులను ఎత్తుకెళ్లారు. కాగా, శనివారం హుండీని పగులగొట్టి నగదును అపహరించారు. ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చిన సహాయకురాలు హుండీ అపహరణకు గురైందని గమనించి స్థానికులకు సమాచారం అందించింది. వారు పరిసరాల్లో హుండీ పడి ఉండటాన్ని గమనించి పూజారికి సమాచారం ఇచ్చారు. కాగా, గత వారం రోజులు క్రితం ఆలయం ముందు ఉన్న ఇంట్లో ఐదు తులాల బంగారుతో పాటు కొంత నగదు అపహరణకు గురైన సంగతి పాఠకులకు తెలిసిందే. వరుస చోరీ సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు స్పందించి గస్తీ పెంచాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అచ్చంపేట పట్టణంలో...


బీరువా పగులగొట్టిన దుండగులు

అచ్చంపేటటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలకు కంటిమీద కునుకు లెకుండా చేస్తున్నది. తాళం వేసిన ఇళ్లు టార్గెట్‌గా చేసుకొని దొంగలు తమ చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణంలో ఆదర్శనగర్ కాలనీలో శుక్రవారం అర్ధ రాత్రి దొంగలు పడి 15తులాల బంగారాన్ని దోచుకెళ్లినట్లు తెలుస్తున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పదర ఎంఈవో బుచ్చిబాబు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న దాదాపు 15 తులాల బంగారాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల ఇదే తరహాలో దొంగతనాలు వరుసగా జరుగుతుడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ప్రధాన కూడలీల వద్ద సీసీ కెమెరాలు ఉండేవి.. వాటిద్వారా దొంగల ఆనవాలు కనిపెట్టేవారు. ప్రస్తుతం అవికూడా పనిచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించే యంత్రంతో కూడిన వాహనం నడిపిస్తున్న డ్రైవర్‌కు రాజాపూర్ గ్రామానికి చెందిన గోపాల్(59) దానిముందు రాళ్లు, చెత్త తీస్తున్నాడు. జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని తపోవనం ముందు జాతీయరహదారిపై మట్టిని తొలగిస్తున్న వాహనాన్ని వెనకనుంచి వచ్చిన కర్ణాటకకు చెందిన డీసీఎం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గోపాల్‌ను రోడ్డు స్వీపింగ్ వాహనాన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై మృతుడి భార్య బుక్క యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు సీఐ యాదిరెడ్డి తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మక్తల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించి రూ.28,040ల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్సై-2 ఆచారీ తెలిపారు. శనివారం మక్తల్ పట్టణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా, రంగనాథ్ తండ్రి విజయ్‌కుమార్ వద్ద రూ.13,240లు, ఇల్లూరు గురుస్వామి తండ్రి ఈరన్న వద్ద రూ.7,170, నర్సింహాస్వామి వద్ద రూ.7,580ల విలువగల గుట్కాప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుందని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ కథనం ప్రకారం.. చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన పార్వతం రంగయ్య(65)ఈ నెల 20న ఉదయం 9గంటలకు కల్వకుర్తికి వచ్చాడు. తన స్వగ్రామం తుర్కలపల్లి నుంచి కల్వకుర్తి కోర్టుకు పని నిమిత్తం వెళ్లి వస్తానని ఇంటి దగ్గర చెప్పి శనివారం వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో బాధితుని కుమారుడు పార్వతం పుల్లయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్ని హంగులతో..

● పట్టణాల్లో విస్తరిస్తున్న ప్రైవేటు ఆట స్థలాలు

● రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం
● రాత్రివేళ సైతం ఆడుకునేలా ఫ్లడ్ లైట్ల ఏర్పాటు
● క్రీడాకారులకు చక్కని వేదికగా నిలుస్తున్న పేమెంట్ ప్లే గ్రౌండ్స్
● వినూత్న ఆలోచనతో ఉపాధి పొందుతున్న ఔత్సాహికులు

వనపర్తి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏదైనా ఆట ఆడాలంటే నలుగురు కలిసి ఊరి చివర ఉన్న ఖాళీ స్థలాలలో పొద్దస్తమానం ఆడుకునే వారు. ఇప్పుడు గ్రామాలతో పాటు పట్టణాలలో ఖాళీ స్థలాలు ఉండటం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో పట్టణాలు, గ్రామాల్లో ఖాళీ స్థలాలు లేకుండా పోతున్నాయి. గ్రామాల్లో అక్కడక్కడ ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలాలు ఉన్న క్రీడా సౌకర్యాలు ఉండటం లేదు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టణాలలో ప్రైవేటు ఆట స్థలాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. పట్టణాలలో ఉన్న కొద్దిపాటి స్థలాల్లోనే అన్ని హంగులతో క్రీడా స్టేడియాలు ఏర్పాటు చేసి పలువురు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ క్రీడలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కల్పించి చిన్న పిల్లల నుంచి పెద్దలు ఆడుకునే వరకు వసతులు కల్పిస్తున్నారు.


ఇండోర్‌లో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్

● క్రికెట్‌తో పాటు అన్ని క్రీడలు

రూ.లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఈ స్టేడియాలలో క్రికెట్‌తో పాటు బ్యాడ్మింటన్, చెస్, క్యారంబోర్డు, స్నూకర్, టేబుల్ టెన్నీస్ వంటి క్రీడలు కూడా ఆడుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. వనపర్తి పట్టణంలో క్రీడాకారులు ఆడుకునేందుకు పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌తో పాటు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్ అనువుగా ఉంది. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు పట్టణం విస్తరిస్తుండటంతో ఆ రెండు గ్రౌండ్‌లలో ఉదయం, సాయంత్రం వేళలో నిత్యం వాకర్స్ వాకింగ్ చేస్తుండటంతో పాటు ఉన్న కొద్దిపాటి గ్రౌండ్‌లోనే వీకెండ్‌లో వందల సంఖ్యలో క్రీడాకారులు అక్కడే వివిధ ఆటలు ఆడుతుండటంతో ఇబ్బందిగా మారింది.

దీంతో చేసేదేమీ లేక వీకెండ్‌లలో ప్రైవేటు ఆట స్థలాలకు వెళ్లి ఒక్కొక్క క్రీడకు నిర్వాహకులు సూచించిన విధంగా గంటకు రూ.500 నుంచి ఆ పైన ఆడినంత సేపు డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ ప్రైవేటు ఆట స్థలాల్లో క్రికెట్‌తో పాటు వివిధ రకాల క్రీడలు ఆడుకునేలా ఏర్పాటు చేస్తున్నారు.


ఇండోర్‌లో బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు ఏర్పాటు చేసిన కోర్టు

● చాలా మంది ఆసక్తి చూపుతున్నారు



గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఇండోర్‌లో క్రీడలు ఆడటానికి పిల్లలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. నేను గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ క్రికెట్ కోచ్‌గా పని చేస్తున్నాను. ఏడు సంవత్సరాల పిల్లల నుంచి 16 ఏళ్ల వరకు క్రికెట్‌లో మెలకువలు నేర్పిస్తున్నాను. ప్రతి స్టూడెంట్‌కు నెలకు రూ.500 తీసుకుంటున్నాం.

● రాంబాబు, క్రికెట్ కోచ్

పెరుగుతున్న ఆదరణ

పట్టణాలలో రోజు రోజుకు ప్రైవేటు ఆట స్థలాలకు ఆదరణ పెరుగుతుంది. ఫ్లడ్ లైట్‌ల వెలుతురులో రాత్రిళ్లు ఆడుకునేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్న చిన్న గ్రౌండ్‌లు ఏర్పాటు చేస్తుండటంతో బంతి కోసం ఎక్కువ దూరం పరుగెత్తాల్సిన అవసరం ఉండదు. గ్రౌండ్ చిన్నగా ఉండటంతో కేవలం ఆరుగురు ఆటగాళ్లతోనే ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి గంటలోనే మ్యాచ్‌ను ముగించేస్తున్నారు. బంతి దూరం వెళ్లకుండా చుట్టుముట్టు నెట్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రౌండ్‌లోపల పరుగెత్తిన దుమ్ము, ధూళి వంటి సమస్యలు లేకుండా కృత్రిమ గడ్డిని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడికి ఆడటానికి వచ్చే క్రీడాకారులకు స్నాక్స్‌తో పాటు టీ, టిఫిన్ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో వీకెండ్‌లో ప్రైవేటు ఆట స్థలాలకు ఆదరణ పెరుగుతుంది.

అసెంబ్లీలో చర్చించిన సమస్యలపై

చర్యలు తీసుకోని అధికారులు

● పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మాపై చర్యలు చేపట్టాలి
● ఉదండాపూర్ రిజర్వాయర్ భూసేకరణ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి
● స్పీకర్‌కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వినతి

జడ్చర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో చర్చించిన సమస్యలపై అధికారులు చర్యలు తీసుకో లేదని, చర్యలు తీసుకోవా లంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వినతిపత్రం అందచేశారు. హైదరాబాద్‌లో శని వారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించిన భూసేకరణలో భారీగా అక్రమాలు జరిగాయని, పరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో మాట్లాడానని వివరించారు.

ఈ వ్యవహారంపై అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. ఉదండాపూర్ భూసేకరణపై విచారణ చేయించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ విడుదల చేస్తున్న కలుషిత నీటి కారణంగా ముదిరెడ్డిపల్లి చెరువు పూర్తిగా కలుషితమైందని వివరించారు. చెరువులో చేపలు మృతి చెందాయని, వ్యవసాయ పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతీసే కోనోకార్పస్ చెట్లను తొలగించాలన్న అంశంపై సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ స్పీకర్‌కు వివరించారు. అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాదేపల్లి మార్కెట్ స్థాయిని పెంచాలంటూ మంత్రికి వినతి

బాదేపల్లి మార్కెట్ స్థాయిని పెంచాలంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావును జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. స్పెషల్‌గ్రేడ్‌గా ఉన్న మార్కెట్‌ను సెలక్షన్ గ్రేడ్‌గా పెంచాలని కోరారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు ఎంతో చరిత్ర కలిగిఉందని పేర్కొన్నారు. మార్కెట్‌లో వరి ధాన్యం, వేరుశనగ, కందులు, మొక్కజొన్న, రాగులు, ఆముదాలు, సన్‌ఫ్లవర్ తదితర వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగుతాయని వివరించారు.

స్పెషల్‌గ్రేడ్‌గా ఉన్న మార్కెట్‌లో సిబ్బంది, సౌకర్యాలు మార్కెట్ అవసరాలకు సరిపో వడం లేదని తెలిపారు. మార్కెట్ స్థాయిని పెంచి.. సిబ్బంది, సౌకర్యాలు కల్పించాలని కోరారు.


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

నేడు ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్ష


పరీక్ష కోసం చదువుతున్న చింతలకుంట పాఠశాల విద్యార్థులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 2,950 మంది విద్యార్థులు
- ఎంపికైతే నాలుగేళ్లకు ఏటా రూ. 12 వేల స్కాలర్‌షిప్ మంజూరు
- ఉమ్మడి జిల్లాల్లో 3188 పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న వారు 26,794 మంది

అయిజటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో రెక్కాడితే కానీ డొక్కాడని కూలీ కుటుంబాలు కోకొల్లలుగా ఉంటాయి. అటువంటి కుటుంబాలలో ప్రాథమిక విద్య అనంతరం పై చదువులు చదివించాలంటే చాలా మందికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి. ఇంకా ముఖ్యంగా చెప్పాలంటే ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి ఆడపిల్లను ప్రాథమిక విద్య అనంతరం బడులు మాన్పించటం గ్రామాల్లో పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులన్నింటిని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. దానిద్వారా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ టెస్టును రాసేందుకు నింబంధనలు ఉన్నాయి. ఇప్పటికే 2024-25లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 8వ తరగతి చదివే బాలబాలికలు 2,950 మంది దరఖాస్తు చేసుకుని నేడు ఆయా జిల్లా కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా....

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 3188 ఉండగా అందులో 8వ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులు 26,794 మంది ఉన్నారు. ఇందులో కేవలం 2,950 మంది విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ టెస్టుకు దరాఖాస్తు చేసుకోవటం చూస్తే ఈ పరీక్షపై ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులకు ఈ పరీక్షలపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్ ఎంత వస్తుంది..

8వ, తరగతి చదివే విద్యార్థులు పరీక్ష రాసి ఎంపికైతే వారికి 9, 10, 11, 12 తరగతుల వరకు సంవత్సరంలో 10 నెలలు (నెలకు రూ, 1200 లాగా) ఏడాదికి రూ, 12000 నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలోనే జమ అవుతాయి. ఈ విధంగా నాలుగేళ్లకు పుస్తకాలు, వారికి కావలసిన విద్యాపరమైన అవసరాలు తీర్చుకునేందుకు గానూ 48వేల రూపాయలు విద్యార్థికే నేరుగా అంది వారి చదువు ఎటువంటి అటంకం లేకుండా కొనసాగే అవకాశం ఏర్పడుతుంది. పరీక్ష విధానం కూడా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు రెండు విభాగాలుగా 180 ప్రశ్నలతో ఉంటుంది. మొదటి విభాగంలో 90 మార్కులకు గానూ మెంటల్ ఎబిలిటీ, కోడింగ్, డీకోడింగ్, లాజికల్, అల్ఫాబెట్, రీజనింగ్, సంఖ్యాశాస్త్రం, వెన్ చిత్రాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. రెండో విభాగంలోని 90 మార్కులకు గానూ 7, 8వ, తరగతుల సిలబస్ నుంచి గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పాఠ్యాంశాల నుంచి అబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ఈ రెండింటికి గాను 110 మార్కులు సాధిస్తే స్కాలర్‌షిప్‌కు ఎంపిక అవుతారు.

పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగే స్కాలర్‌షిప్ టెస్టుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గద్వాల జిల్లాలో మొత్తం 65 పాఠశాలల నుంచి 785 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు గానూ ప్రభుత్వ అభ్యసన, ప్రభుత్వ బాలుర, బాలిక, బ్రిలియంట్ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేయటం జరిగింది. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలెటర్ లాగా 39 మందిని నియమించి, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను కూడా కేటాయించాం. పరీక్ష ఉదయం 9:30 ప్రారంభమయ్యే దానికంటే గంట ముందుగా విద్యార్థులు ఆయా కేంద్రాలకు చేరుకోవాలి.

- శ్రీనివాసులు, పరీక్షల విభాగం అధికారి, గద్వాల

మాలాంటి పేదింటి పిల్లలకు ఎంతో మేలు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్కాలర్‌షిప్ వల్ల మాలాంటి పేదింటి పిల్లలు ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉండదు. డబ్బులు లేక చదివంచలేని తల్లిదండ్రులు కూడా ఈ పరీక్షలో పాసైతే ఉన్నత చదువులు చదివించే అవకాశం ఉంది. ఈరోజు జిల్లా కేంద్రంలో పరీక్ష ఉంటుందని మా సారువాళ్లు ముందే చెప్పారు. అందుకే పరీక్షకోసం ప్రణాళికా బద్దంగా చదివాను.

- షర్మిళ, 8వ,తరగతి. చింతలకుంట,కేటీదొడ్డి

క్షేత్రస్థాయి అధ్యయనానికి శిక్షణ ఐఏఎస్‌లు

జడ్చర్ల/కోయిలకొండ/దేవరకద్ర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోనే ఉంటూ గ్రామంలో క్షేత్రస్థాయి అధ్యయనానికి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్‌లు శనివారం జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి వచ్చారు. వీరికి జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్‌తో పాటు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు శిక్షణ ఐఏఎస్‌లు పారుల్‌సింగ్, ఆదిత్యరాయ్, యశ్‌సుమీర్‌కుమార్‌కాలె, హరిప్రశాంత్, మాన్సిరాజీవ్‌గోఖలేలు గ్రామంలోనే ఉంటూ క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తారని ఎంపీడీవో తెలిపారు. గ్రామంలో బస చేసేందుకు గ్రామంలోని ఓ వసతిగృహాన్ని ఎంపిక చేశారు. స్వాగతం పలికిన వారిలో బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, బాదేపల్లి సింగిల్ విండో వైస్‌చైర్మన్, తదితరులున్నారు.

దమాయపల్లిలో..

కోయిలకొండ మండలంలోని దమాయపల్లిలో ఆల్ ఇండియా సర్వీస్ బృందం శనివారం పర్యటించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఏఆర్ఎస్‌కు ఎంపిక అయిన ఐదుగురు బృందం గ్రామంలో ఐదు రోజులు పాటు ఉండి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును అధ్యయనం చేయనున్నట్లు తహసీల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో కాళప్ప తెలిపారు.

గ్రామంలో వారు ఉండేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం, పంచాయతీలో జరు గుతున్న పనులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

ఎంపీవో నసీర్‌అహ్మద్, కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో శిక్షణ కలెక్టర్‌లు

దేవరకద్ర మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో శనివారం నూతన శిక్షణ కలెక్టర్‌ల బృందం గ్రామంలో పర్యటించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతన శిక్షణ కలెక్టర్‌లు నాలుగు రోజుల పాటు ఉండి గ్రామంలో సామాజిక స్థితిగతులు, ప్రజలకు అందుతున్న సంక్షమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగహన చేసుకుంటున్నారన్నారు. అనంతరం శిక్షణ కలెక్టర్లకు స్వాగతం పలికారు.

తహసీల్దార్ కృష్ణయ్య, శిక్షణ కలెక్టర్లు అజేయ్‌కుమార్, వివేక్ ప్రవిన్‌కు మార్, యాగేందర్‌మోహన్, దిక్షతమినా పాల్గొన్నారు.


జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి క్షేత్రస్థాయి అధ్యయనానికి వచ్చిన శిక్షణ ఐఏఎస్‌లు

లెదర్‌పార్కును పునఃప్రారంభించేలా

చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రికి వినతి

జడ్చర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం పోలేపల్లి సమీపంలోని లెదర్ పార్కును పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ పాలమూరు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగళి శ్రీకాంత్ వినతిపత్రం అంద చేశారు. లెదర్‌పార్కుతో దళితుల కుటుంబాలకు న్యా యం చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వానికి, పాలమూరు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక లేఖ ద్వారా లెదర్‌పార్కు అంశంపై సమగ్ర సమాచారం తీసు కుని, దళితుల కుటుంబాలకు అండగా ఉంటా నంటూ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వెల్లడించారని శ్రీకాంత్ తెలిపారు. వినతిపత్రం అంద చేసిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు శంకర్, నిర్మల్, శ్యామ్ ఉన్నారు.

గోవిందా.. గోవింద

కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిన్నచింతకుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దాంతో స్వామి వారి దేవరగట్టులోని కాంచనగుహతో పాటుగా జాతర మైదానం అంతా గోవింద.. గోవిందా.. కురుమూర్తి వాసా గోవిందా అంటూ ఎంతో భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. స్వామి వారి మెట్లదారి నిండా భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి పోటెత్తారు.

అలాగే జాతర మైదానంలో భక్తుల రద్దీ కన్పించింది. భక్తులు దాసంగాలు పెట్టా రు. వివిధ దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

మహిళలు గాజుల దుకాణాల్లోనూ సందడి వాతావరణం నెలకొంది.


కురుమూర్తిస్వామి వారి గుట్టమీద భక్తుల రద్దీ

ఇంటర్వ్యూ..



ఓటరుగా నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ రామకృష్ణయ్య

తిమ్మాజిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : 18ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే ఓటరు నమోదు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణయ్య సూచించారు. తిమ్మాజిపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన పలు విషయాలు

ఓటరు నమోదు కార్యక్రమం ఎన్ని రోజులు కొనసాగుతుంది?

ఎన్నికల అధికారి ఆదేశానుసారం మరోమారు ఓటరు నమోదు ప్రత్యేక సవరణకు అవకాశం కల్పించింది. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత ఏమిటీ ?

2025 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండబోయే యువతీ యువకులు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడానికి అర్హులు.

గ్రామాలలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన వారి కోసం ఏమైనా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారా?

గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు. అర్హులైన యువతీ, యువకులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన వారందరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడానికి, లేదా ఏమైనా సవరణలు చేసుకునే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇటీవల కళాశాలల్లోనూ విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాము.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో ఖచ్చితమైన మెనూ పాటించాలని, సరఫరా అయ్యే బియ్యం, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు వండి వడ్డించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ బీసీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు వండిన భోజన నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని స్టోర్‌రూమ్, డార్మెటరీ హాల్‌ను పరిశీలించారు.

భోజనం నాణ్యతగా ఉండాలి : కలెక్టర్

విద్యార్థులకు అందించే భోజనం పరిశుభ్రంగా, నాణ్యతతో కూడినదై ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రుల్లో అందించే ఆహారంపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవ సహాయం, సంబంధిత జిల్లా అధికారులు, బీసీ, ఎస్సీ గురుకులాలు, సంక్షేమ హాస్టల్లో నిర్వహణపై అధికారులతో సమీక్షించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్

గ్రామాలు, మునిసిపాలిటీలలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం కలెక్టర్ వరి, పత్తి కొనుగోళ్లు, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి దాకా ఎన్ని క్వింటాళ్ల వరి కొనుగోలు చేశారని సివిల్ సప్లయ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా సామాజిక సర్వే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. సర్వే పూర్తి చేసిన ఫారాల భద్రత స్టోరేజ్‌పై ఎంపీడీవో, కమిషనర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కే.సీతారామా రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లో అవినీతి సహించం

- చెక్కుల పంపిణీలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో దళారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏడు మండలాలకు చెందిన 164 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనుద్దేశించి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ- కల్యాణలక్ష్మి, షాదీముబార్ లబ్ధిదారులను రోజుల తరబడి కార్యాలయం చుట్టు తిప్పుకోకుండా 15 రోజుల్లోపు వారికి చెక్కులు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో దళారులు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తన దృష్టికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భన్సీలాల్, కొల్లాపూర్ తహసీల్దార్ మురళీధర్‌రావు, కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, మునిసిపల్ కౌన్సిలర్లు, అధికారులు కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన 18 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సూర్యప్రతాప్‌గౌడ్, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల చంద్రయ్య, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేపట్టాలి

-కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్ డిమాండ్

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వంగూరు మండలం సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు దారి తీసిన సూసైడ్ నోట్ ఆధారంగా ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని నిరూపించుకుని సమగ్ర విచారణ చేపట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. అన్ని రకాల విషయాలను బయటకు తీసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విలేకర్ల సమావేశంలోనూ మాట్లాడారు. సాయిరెడ్డి కొండారెడ్డిపల్లికి రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా పని చేశారని 80ఏళ్లు పైబడి పెద్ద స్థాయిలో ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం తన మరణ వాంగ్మూలంలో రాశాడని తెలిపారు. ముఖ్య మంత్రి స్పందించి సూసైడ్ నోట్ ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సాయిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సాయిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య తీరని లోటని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సాయిరెడ్డి మృతదేహాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్ కుమార్‌యాదవ్, షానవాజ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కొండారెడ్డిపల్లిలో పోలీస్ పహారా

వంగూరు : మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య నేపథ్యంలో శనివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి వచ్చి కేవీఎన్‌రెడ్డి నివాసంలో ఉన్నారు. సాయిరెడ్డి ఆత్మహత్యకు గల కారణాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కుచుకుల్ల రాజేష్‌రెడ్డిలు గ్రామాన్ని సందర్శించారు. సాయిరెడ్డి మృతి పట్ల వారు సంతాపం వ్యక్తం చేశారు. సాయిరెడ్డి మృతదేహం ఇంకా కల్వకుర్తి మార్చురీలోనే ఉంది. తన కుమారుడు యూఎస్ నుంచి వస్తున్నాడు. ఆయన వచ్చిన తర్వాత మృతదేహాన్ని గ్రామానికి తీసుకరానున్నారు.



కొండారెడ్డిపల్లిలో పోలీస్ పహారా

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- రైతుకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి భరోసా

తిమ్మాజిపేట/ బిజినేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అధైర్యపడవద్దు ఆదుకుంటామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి రైతును ఓదార్చారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లయ్యకు చెందిన పత్తి ఇటీవల దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ గ్రామానికి శనివారం వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ అప్పులు చేసి పండించిన పత్తి పంట కళ్ల ముందే కాలిపోతుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలోఉన్నానని, కూతురు వివాహం కూడా త్వరలో ఉందని ఎమ్మెల్యే ముందు రైతు వాపోయారు. స్థానిక తహసీల్దార్ రామకృష్ణయ్యతో ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడుతూ పత్తి దగ్ధం కావడంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు త్వరగా అందజేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తానని రైతుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డి, మాధవులు, శ్రీనివాస్, కొండా నాగేష్, రవూఫ్, ముబారక్, హర్షవర్ధన్‌రెడ్డి, దేవస్వామి, నాగసాయిలు, చంద్రమౌళి, వెంకటయ్య పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

తిమ్మాజిపేట మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

● బిజినేపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపికలో డబ్బులు వసూలు చేసి దళారులుగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంతో పాటు బిజినేపల్లి రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు రూ. 2.80 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబార్, సీఎం సహాయ నిధి చెక్కులను ఆయా పథకాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, మండల అధ్యక్షుడు మిద్దె రాములు, జిల్లా నాయకులు వెంకటస్వామి, తిరుపతయ్య, రాంచందర్, అవంతి శంకర్, ఆంజనేయులు, వాల్యానాయక్, భగవంత్‌గౌడ్, గోవిందునాయక్, కృష్ణ నాయక్, నగేష్, బాలపీరు, రాంచందర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, అమృత్ రెడ్డి, బంగారయ్య, హనుమంత్ రెడ్డి ఉన్నారు.

'రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం'

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ విమర్శించారు. రైతులు పండించిన సన్నరకంతో పాటు దొడ్డరకానికి కూడా 500రకాల బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబెట్టుకున్న వరిని శనివారం మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటికైనా రైతులు వరికి దొడ్డు, సన్న రకాల వరికి క్వింటాల్‌కు 500చొప్పున బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎడ్మ సత్యం, నాయకులు గోవర్ధన్, మనోహర్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, భవాండ్ల మధు, తాహేర్, సూరి, శ్రీధర్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

అమ్రాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించి బాలికలను చదివించడం ద్వారానే వారికి రక్షణ ఉంటుందని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండల పరిధిలోని బీకే లక్ష్మాపురంలో శనివారం గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న వయసులో బాలికలకు పెళ్లిళ్లు చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి హర్ష, మౌనిక, రేణుక, మంగ, పద్మ తదితరులు ఉన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణితం సబ్జెక్టు బోధించడానికి అతిథి అధ్యాపకులు ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ గణితం విద్యార్హత కలిగి ఎస్ఎస్‌సీ, డిగ్రీ, ఫొటోలు బయోడెటాతో అభ్యర్థులు రెండు సెట్ల దరఖాస్తును సమర్పించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబరు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌లు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని మార్కెట్‌యార్డులో మహిళా సంఘాల ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన వరిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. కౌన్సిలర్లు ఎజాజ్, రవి, కాంగ్రెస్ నాయకులు మసూద్, చంద్రకాంత్‌రెడ్డి, పడకండి వెంకటేశ్, సురేష్, మార్కెట్ సెక్రటరీ భగవాన్, మహిళా సమం సభ్యులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సమగ్ర కుటుంబ సర్వే డేటాను పరిశీలించిన సీఈవో

అచ్చంపేటటౌన్, నవంబరు 23 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో గోపాల్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మధుసూ దన్‌గౌడ్‌తో కలిసి సమగ్ర కుటుంబ సర్వేను టీఏలు డేటా ఎంట్రీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే ఎంట్రీని సమగ్రంగా నిర్వహించాలన్నారు. డేటా ఎంట్రీ చేసిన పత్రాలను స్టోర్ రూంలో భద్రపరచాలన్నారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా షిఫ్టింగ్‌ల వారిగా కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ సుందరీకరణకు చర్యలు

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణ ప్రధాన రహదారి వెంట ఉన్న డివైడర్లపై నాటేందుకు హైదరాబాద్ నుంచి విలువైన మొక్కలు కొల్లాపూర్‌కు తీసుకొచ్చారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం పట్టణంలోని ప్రస్తుతం డివైడర్లపై ఉన్న మొక్కలను తొలగించి దాదాపు రూ.60 లక్షలతో ఒకే రకమైన, ఒకే జాతి మొక్కలను నాటేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ నుంచి తెచ్చిన మొక్కలను పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో దించారు. ఈ మొక్కలను రెండు రోజుల్లోపు కొల్లాపూర్ పట్టణ ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేస్తామని హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ఖాదర్ పాషా, బొరెల్లి మహేష్, కర్నె వాసు, దిలీప్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



డివైడర్లపై నాటేందుకు తెచ్చిన మొక్కలు

బీజేపీ గెలుపుతో సంబురాలు

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించిందని దేశ వ్యాప్తంగా మోదీ హవా కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సుధాకర్‌రావు మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజలు తెలివితో సుపరిపాలన అందిస్తున్న బీజేపీని మళ్లీ ఎన్నుకోవడం సరైన నిర్ణయమని అన్నారు. తమ స్వలాభం కోసం సిద్ధాంతాన్ని పక్కకు పెట్టి కాంగ్రెస్ సరసన చేరిన ఉద్ధవ్ ఠాక్రేకు ప్రజలు సరైన బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సంద రమేష్, కేతూరి నారాయణ, మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్, కడతాల కృష్ణ, కాశీపురం మహేష్, పురేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

న్యూస్ బాక్స్

సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

బల్మూరు,నవంబరు23(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుమ్మన్ పేట గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అధికారులు స్థలం పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసమై గట్టుతుమ్మెన్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మాజీ వైస్ ఎంపీపీ నూనె నారాయణ తెలిపారు. కరెంటు అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వేయర్, గ్రామ ప్రజలు గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని పరిశీలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టుతుమ్మెన్ గ్రామ ప్రజలు శివ, చంద్రయ్య, మాజీ సర్పంచ్ మధు, మాజీ ఎంపీటీసీ నారాయణ, సర్పంచ్‌లు బాల స్వామి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ తదతరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

కోడేరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని బావాయిపల్లిలో సర్వే నెంబర్ 59,60 భూమి కోల్పోయిన రైతుల పొలాల్లో అధికారులు మామిడి తోటలు తొలగిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 59,60,61లో కాశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డి పనుల్లో భాగంగా 2020లో 7 ఎకరాల 02 గుంటల భూమి కోల్పోయామని అన్నారు. అధికారులు అప్పట్లో ఎకరాకు రూ. 5లక్షలు కట్టించారని మామిడితోటలకు మాత్రం డబ్బులు చెల్లించలేదన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా అధికారులు మామిడి తోటలను తొలగించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షల వల్ల తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారులు తమకు పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని కోరారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను కొల్లాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్‌రెడ్డి ఇంటి నుంచి ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి కేక్ కట్ చేసి ఘనంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు జరిపారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదాని ముడుపులపై దర్యాప్తు సంస్థల నాన్చుడు ధోరణి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అదానీ ముడుపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడ్ ఎం.బాల్ నర్సింహ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గౌతమ్ అదానీ వ్యాపార సంస్థలు అవినీతి ముపుడుల వ్యవహారంలో కేంద్ర విచారణ సంస్థలు ఈడీ, సీబీఐలతో పాటు ఆర్థిక సంస్థలు సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీయేతర ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేవలం వంద కోట్ల అవినీతి ఆరోపణలు వస్తేనే అడ్డగోలు విచారణ చేపట్టే దర్యాప్తు సంస్థలు ఈ విషయంలో మౌనం వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, జి.కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, జిల్లా నాయకులు చంద్రమౌళి, యేసయ్య, బొల్లెద్దుల శ్రీను, కృష్ణాజీ, లక్ష్మీపతి, శివశంకర్, శంకర్‌గౌడ్, మర్యాద వెంకటయ్య, ప్రేమ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.బాల్‌నర్సింహ

జీహెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జె.శ్రీనివాస్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జె.శ్రీనివాస్ రెడ్డి నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో జీహెచ్‌ఎంల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా తిరుపతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా భాస్కర్‌రెడ్డి, జి.కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మెరుగైన విద్య అందించేం దుకు జీహెచ్‌ఎంల సంఘం కృషి చేస్తుంద న్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంల సంఘం ఎన్నికల అధికారులు చంద్రప్రకాష్, సర్దార్, గిరిధర్, తుకారాం, ఎస్టీ యూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, చంద్రుడు, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌మూర్తి, బాలకిషన్, లత, రఘునం దన్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులకు పెంచిన వేతనాలతో పాటు జీవో నెంబరు 60 ప్రకారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, మునిసిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు శేఖర్, ప్రధనా కార్యదర్శి శేఖర్, కోశాధికారి సంధ్య, నాయకులు పరుశ, భవాని, వెంటకయ్య, సత్యం పాల్గొన్నారు.

విజయవంతమైన మెగా వైద్య శిబిరం

చారకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దాక్షాయణీ, కార్డియాలజిస్ట్ డాక్టర్ వినోద్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఆఫాన్‌లు వైద్యశిబిరంలో పాల్గొని రోగులకు బీపీ, షుగర్, టూడికో, ఈసీజీ ఇతర వైద్య పరిక్షలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో 1,500 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ ముస్తఫము జ్జుబాయి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు జమ్మి కింది బాల్‌రాంగౌడ్, ఎదిరే రవిందర్, వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గజ్జె యాదయ్యగౌడ్, మాజీ సర్పంచులు నరేషనాయక్, సాయికుమార్, రవిందర్‌రెడ్డి, మహేష్, మాజీ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్, జైపాల్ పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు

క్రైం కార్నర్

16 గొర్రెల అపహరణ - కేసు నమోదు

ఉప్పునుంతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల అపహరణ కేసు నమోదైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకోంది. ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బత్తుల రేణయ్య ఇంటి వద్ద ఉన్న మందలలో 80 గొర్రెలు ఉన్నాయి శనివారం ఉదయం చూసే సరికి 16 గొర్రెలు కనిపించకుండా పోయిన్నాయి. ఎక్కడ ఎతికిన కనిపించక పోవడంతో బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడికి గాయాలు

మన్ననూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీ చెక్‌పోస్టు సమీపంలో కారు ఢీకొని ఓ వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. అచ్చంపేట మండలం వలపట్ల గ్రామానికి చెందిన బాలయ్య అనే వృద్ధుడు మన్ననూరులో బంధువుల ఇంటికి వచ్చాడు. మేకకు చెట్టు ఆకును తీసుకొచ్చేందుకు శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అతడి రెండు కాళ్లు విరిగాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు.